

భక్తులకు బీఎస్ఎన్ఎల్ సేవలు

మేడారం శ్రీసమ్మక్క-సారలమ్మ జాతరకు వస్తున్న భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు బీఎస్ఎన్ఎల్ జీఎం చంద్రమౌళి తెలిపారు. - 8లో▸



'మహాలక్ష్మి'తో ఎన్నో ప్రయోజనాలు

ఆర్టీసీ బస్సులు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్నాయి.. మహాలక్ష్మి పథకంతో అనేక ప్రయోజనాలున్నాయని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం

$34^0/20^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత కాస్త తగ్గుతుంది.

న్యూస్‌రీల్

తమలపాకులపై శ్రీరామ నామం



జనగామ: పట్టణ పరిధి గుండ్లగడ్డ ఉమామహేశ్వరాలయంలో శనివారం హనుమంతుడికి చందన సమర్పణతో పాటు 108 తమలపాకులపై భక్తులు శ్రీరామ జపంతో మాలధారణ చేశారు. అనంతరం స్వామికి దీపారాధన చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి రాజేష్ భార్గవ, శ్రీకాంత్, విగ్నేష్ పటేల్, హైమ, నాగవేణి, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వార కల్యాణం



చిల్పూరు: శ్రీబుగులు వేంకటేశ్వరాలయంలో శనివారం అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యుల ఆధ్వర్యాన స్వామివారికి వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. వారికి రాజస్థాన్‌కు చెందిన పోచారం చంద్రకళ, విష్ణుప్రియ, కుందన్‌సింగ్, ఓటేసింగ్, జ్యోత్స్నాదేవి, ఈఓ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కళ్లెం విద్యార్థిని



లింగాలఘణపురం: కళ్లెం ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని బోయిన నవ్య రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం.యాదగిరి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో(తెలుగు మీడియం విభాగం) ప్రథమ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నవ్యను సైన్స్ ఉపాధ్యాయులు నాగరాజు, సత్యనారాయణ తదితరులు అభినందించారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలి

జిల్లా విద్యాధికారి రాము



జనగామ రూరల్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని జిల్లా విద్యాధికారి కె.రాము అన్నారు. శనివారం పట్టణంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో జేవీవీ జిల్లా స్థాయి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంచడంతోపాటు మూఢ విశ్వాసాలను తొలగించడానికి జేవీవీ కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు భావిభారత శాస్త్ర వేత్తలుగా ఎదగడానికి పరిశోధనలు చేయాలని సూచించారు. ఎన్ఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్ రాంచద్రయ్య మాట్లాడుతూ.. జేవీవీ రాష్ట్ర మహాసభలు జనగామలో ఈనెల 9,10,11 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సెమినార్లు, సైన్స్ స్టాళ్లు, ఎగ్జిబిట్లు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి, సైన్స్ కార్నివాల్, మ్యాజిక్ ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. జిల్లా అధ్యక్షుడు మర్రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, జిల్లా కార్యదర్శి రవీందర్, ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, బాలరాజు, శోభన్‌రెడ్డి, చంద్రశేఖర్ రావు, శ్రీనివాసచారి, చంద్రబాను తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కంచెకు రైతు బలి

జనగామ రూరల్: జనగామ మండలం అడవికేశ్వాపూర్ గ్రామానికి చెందిన రైతు చేట్కూరి కనకయ్య(40) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. కనకయ్య తన వరి పంటను వన్య ప్రాణుల నుంచి కాపాడుకోవడానికి శుక్రవారం పొలం చుట్టూ విద్యుత్ తీగలు అమర్చుతున్నాడు. ఈ క్రమంలో షార్ట్ సర్క్యూట్ అయి విద్యుత్ వైరు కాలికి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి అయినా ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు. శనివారం ఉదయం పరిసరాల రైతులు విగతజీవిగా పడి ఉన్న కనకయ్యను గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేయగా.. వారు అక్కడికి చేరుకు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కాంగ్రెస్ గూటికి రాజయ్య!



పార్టీ పెద్దలతో మంతనాలు..

10న ముహూర్తం?

- బీఆర్ఎస్ టికెట్ నిరాకరణనుంచి అసంతృప్తి
- అభ్యర్థుల గెలుపునకు పనిచేసినా గుర్తింపులేదని ఆవేదన
- కాంగ్రెస్ పార్టీలో చేరడంపై అనుచరులకు సంకేతాలు
- వరంగల్ పార్లమెంట్ స్థానంపై రాజయ్య గురి

సాక్షిప్రతినిధి, వరంగల్:

బీఆర్ఎస్ పదవులకు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య కాంగ్రెస్ గూటికి చేరనున్నారా? ఇప్పటికే ఆయన ఏఐసీసీ, టీపీసీసీ పెద్దలను కలిశారా? రాజీనామాకు ముందే ముహూర్తం సిద్ధం చేసుకున్న రాజయ్య.. కాంగ్రెస్‌లో చేరడం లాంఛనమేనా? అసెంబ్లీ ఎన్నికలు ముగిసేవరకు వేచిచూసి పార్టీని వీడిన ఆయన.. వరంగల్ పార్లమెంట్ టికెట్‌పై గురిపెట్టారా?.. అంటే... అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. స్టేషన్‌ఘన్‌పూర్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న తనను తప్పించి 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి టికెట్ ఇవ్వడం పట్ల రాజయ్య తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. సీఎం కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తదితరులు రంగంలోకి దిగి వారం రోజులపాటు సంప్రదింపులు జరిపి రైతుబంధు రాష్ట్ర చైర్మన్ పదవి ఇవ్వడం ద్వారా బుజ్జగించారు. అయినప్పటికీ అసంతృప్తిని వీడడం లేదన్న సమాచారంతో అధిష్టానం రాజయ్యకు జనగామ నియోజకవర్గంలో ప్రచారబాధ్యతలు అప్పగించి అనూహ్యంగా స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి తప్పించింది. ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడం.. బీఆర్ఎస్ ఓడిపోవడం.. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పునరాలోచనలో పడిన డా.టి.రాజయ్య హస్తం పార్టీ గూటికి చేరాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆయన శనివారం బీఆర్ఎస్ పదవులు, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు అనుచరవర్గాలు చెబుతున్నాయి.

అధిష్టానం తీరుపై కట్టలు తెగిన అసంతృప్తి..

స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డా.టి.రాజయ్య తన రాజీనామా సందర్భంగా బీఆర్ఎస్ అధిష్టానంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమం కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరి కేసీఆర్ వేలుపట్టుకుని నడిచినా చివరకు మానసిక క్షోభకు గురయ్యానంటూ అసంతృప్తిని వెళ్లగక్కారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపుకోసం పనిచేస్తే.. తనకు, కేడర్‌కు ఆ పార్టీలో సరైన గుర్తింపు లభించలేదని, కనీసం పార్టీ అధినాయకత్వాన్ని కలిసే అవకాశమే దక్కలేదని ఆరోపించారు. కాగా రాజయ్య రాజీనామాతో వరంగల్‌లో రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉంది.

కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం?

ఎంపీ టికెట్ విషయంలో తనకు పార్టీ హైకమాండ్ నుంచి ఎలాంటి హామీ రాకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురైన డాక్టర్ టి.రాజయ్య బీఆర్ఎస్ పార్టీని వీడినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో వరంగల్ ఎంపీ స్థానంపై గురిపెట్టిన ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు చెబుతున్నారు. ఈ నెల 10న కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని ఆయన అనుచరవర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే రాజయ్య ఏఐసీసీలోని ఇద్దరు కీలక నేతలను కలిసినట్లు ప్రచారంలో ఉంది. ఇటీవల టీపీసీసీ నేతలను కలిసినట్లు చెబుతున్నారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో జిల్లాకు చెందిన మంత్రులు, ముఖ్యనేతలతో వేర్వేరుగా మంతనాలు జరిపినట్లు పార్టీవర్గాల సమాచారం. ఈ అంశాలపై స్పష్టత ఇవ్వని రాజయ్య 'గతంలో నేను 15 ఏళ్లు కాంగ్రెస్‌లోనే ఉన్నా.. కాంగ్రెస్‌లో ఉండి తెలంగాణ కోసం పోరాడా.. పరిచయాలు ఉన్నంత మాత్రాన పార్టీ మారతాననడం సమంజసం కాదు.. బీఆర్ఎస్ విధానాలు నచ్చక రాజీనామా చేశా.. నా అభిమానులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటా' అంటూ దాటవేశారు.

జిల్లా జడ్జి, న్యాయవాదులతో హైకోర్టు జడ్జి శ్రీనివాస్‌రావు



న్యాయవ్యవస్థపై నమ్మకం పెంచాలి



పాలకుర్తి : సోమేశ్వరుడికి అభిషేకం చేస్తూ..



జడ్జికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ శివలింగయ్య

- జనగామ బార్ అసోసియేషన్‌కు రాష్ట్రంలో మంచి పేరు ఉంది
- సీనియర్ల అనుభవాలను జూనియర్లు అందిపుచ్చుకోవాలి
- హైకోర్టు జడ్జి జె.శ్రీనివాస్‌రావు

జనగామ రూరల్: ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం పెరిగేలా న్యాయవాదులు పనిచేయాలి.. ఆదిశగా ప్రతీ ఒక్కరూ కలిసి కట్టుగా కృషి చేయాలి.. జనగామ బార్ అసోసియేషన్‌కు రాష్ట్రంలో మంచి పేరు ఉంది.. సీనియర్ న్యాయవాదుల అనుభవనాలను జూనియర్ న్యాయవాదులు అందిపుచ్చుకోవాలని హైకోర్టు జడ్జి జె.శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన జడ్జి ముందుగా పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం మండల పరిధి బమ్మెరలోని 'అగ్రి లీగల్ ఎయిడ్ సెల్'ను, గ్రామంలోని పోతన సమాధిని సందర్శించారు. పోతన వ్యవసాయం చేసిన సాగు నీటి బావిని చూశారు. అక్కడి నుంచి జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకోగా.. జిల్లా జడ్జి డి.రవీంద్రశర్మ, కలెక్టర్ శివలింగయ్య ఆయనకు స్వాగతం పలికారు. పోలీసులచే గౌరవ వందనం స్వీకరించారు. మధ్యాహ్నం కోర్టులో న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో హైకోర్టు జడ్జి మాట్లాడుతూ.. కక్షిదారుడికి న్యాయం జరుగుతుందనే నమ్మకం ఏర్పడితే సుప్రీంకోర్టుకైనా వెళ్లడానికి సిద్ధపడతాడని, ఆ విధంగా పనిచేసి న్యాయ వ్యవస్థపై గౌరవం పెంచాలన్నారు. అనంతరం సబ్ జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరెళ్ల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు సమస్యలపై జడ్జికి వినతి పత్రం అందజేశారు. జిల్లా కోర్టుకు పసరమడ్లలో 10 ఎకరాల స్థలం కేటాయించారని, ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే కోర్టు భవనం నిర్మించాలని, సబ్‌జైలును ఆ స్థలంలోకి తరలించాలని కోరారు. అదనపు జిల్లాకోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మంజూరు చేయాలని, మహిళా న్యాయవాదులకు ప్రత్యేక హాల్, క్యాంటీన్, జిరాక్స్ సెంటర్ ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన జడ్జి.. హైకోర్టు కమిటీకి తెలియజేస్తానని పేర్కొన్నారు. జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుచరిత, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డీసీపీ సీతారాం, కోర్టు పీపీ భిక్షపతి, బార్ అసోసియేషన్ సెక్రెటరీ రాజయ్య, వైస్‌ప్రెసిడెంట్ రాజశేఖర్, మహిళా కార్యదర్శి స్వప్న, జమాల్ షరీఫ్, ప్రసాద్‌రావు, నాగరాజుశర్మ, ఏజీపీ రాంగోపాల్ తదితరులున్నారు.

ఊరికి రెండెకరాల భూదానం

- దాతృత్వం చాటుకున్న మాజీ సర్పంచ్
- మంచి మనసున్న వ్యక్తి కీర్తి లక్ష్మీనర్సయ్య
- ఎమ్మెల్సీ బండా ప్రకాష్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



భూవితరణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

జనగామ రూరల్: ఒక గుంట భూమికోసం కుటుంబాల మధ్య పోరు నడుస్తున్న ఈ సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఊరి అభివృద్ధికి రెండు ఎకరాల భూమి దానం చేసి దాతృత్వం చాటుకున్నాడు తాజా మాజీ సర్పంచ్ కీర్తి లక్ష్మీనర్సయ్య. జనగామ మండలం వెంకిర్యాల ఊరి చివర కోటి విలువ చేసే భూమిని గ్రామ పంచాయతీకి రిజిస్టర్ చేసి అందజేశారు. ఇందుకు ఆయన కుమారులు కీర్తి వీరేందర్, వెంకటేష్, కుమార్తెలు, కుటుంబ సభ్యులు అడ్డు చెప్పకపోవడం గొప్పవిషయం. శనివారం గ్రామంలో లక్ష్మీనర్సయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన భూవితరణ కార్యక్రమానికి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంత విలువైన భూమిని గ్రామానికి ఇవ్వడం నియోజకవర్గానికే ఆదర్శమని, ఆ స్థలం ప్రజలకు ఉపయోగపడేలా ఆలోచించి నిర్మాణాలు చేపట్టడానికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు కీర్తి వెంకట్రామయ్య, రుక్కమ్మ జ్ఞాపకార్థం.. నర్సయ్య అందజేసిన ఈ భూమిలో చేపట్టే అభివృద్ధి పనులకు తక్షణం రూ.10లక్షలు అందజేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మురళీకృష్ణ, డిటైర్డ్ కల్నల్ డాక్టర్ బిక్షపతి, పసుల ఎబెల్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మిగిలింది మూడు రోజులే..

- పట్టభద్రుల ఓటు నమోదుకు ఆరవ తేదీ చివరి గడువు
- జిల్లాలో 13,014 దరఖాస్తులు
- 1,056 మంది అర్హులుగా గుర్తింపు
- పరిశీలనలో 11,899 అప్లికేషన్లు

మండలాల వారీగా పట్టభద్రుల ఓటుహక్కు కోసం వచ్చిన అప్లికేషన్లు

మండలం	అప్లికేషన్లు	అర్హత	రిజక్టు	పెండింగ్
తరిగొప్పుల	286	30	02	254
నర్మెట	584	98	07	479
జఫర్‌గఢ్	781	79	02	700
కొడకండ్ల	863	105	08	750
చిల్పూరు	585	32	01	552
లింగాలఘణపురం	959	32	-	927
బచ్చన్నపేట	1,160	87	05	1,068
దేవరుప్పుల	1,061	-	-	1,061
పాలకుర్తి	1,389	162	10	1,217
రఘునాథపల్లి	1,011	179	03	829
స్టేషన్‌ఘన్‌పూర్	1,196	252	21	923
జనగామ	3,139	-	-	3,139
మొత్తం	13,014	1,056	59	11,899



జనగామ: వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గ్రాడ్యుయేట్లు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఇంకా మూడు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఈ నెల 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ముగియనుంది. అర్హులైన పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలని కలెక్టర్ శివలింగయ్య ఆదేశాల మేరకు జిల్లాలో విస్తృత ప్రచారం చేపట్టారు.


పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవికి పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాజీనామా చేయడంతో ఎన్నిక అని వార్యమైంది. త్వరలో జరిగే ఈ ఎన్నిక కోసం ఎలక్షన్ కమిషన్ గ్రాడ్యుయేట్లు ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. 2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తి చేసిన, మూడేళ్లు దాటిన వారు అర్హులని పేర్కొంటూ.. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారి కోసం అన్ని తహసీల్ కార్యాలయాల్లో ఫారం-18 అందుబాటులో ఉంచారు. డిగ్రీ మెమో, ఆధార్, ఓటర్ ఐడీ కార్డుతో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకుని, జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ అధికారి సంతకం చేయించి అందజేయాల్సి ఉంటుంది. జిల్లాలో ఇప్పటి వరకు 13,014 అప్లికేషన్లు రాగా వాటిలో 1,056 మందికి ఓటుహక్కు కల్పించారు. 59 అప్లికేషన్లు తిరస్కరణకు గురికాగా.. 11,899 దరఖాస్తులు ప్రాసెస్‌లో ఉన్నాయి. ఓటు హక్కు చివరి గడువుకు మరో మూడు రోజులే ఉంది.

2021లో 21వేల ఓటర్లు

వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీకి 2021 సంవత్సరంలో జరిగిన ఎన్నికల సమయంలో జిల్లా పరిధిలో 21,213 ఓట్లు ఉన్నాయి. 12 మండలాల్లో 31 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాలను 18 లొకేషన్లుగా గుర్తించారు. ఒక ఏఆర్ఓ, ఐదుగురు సెక్టార్ ఆఫీసర్లు, 31 మంది బీఎల్ఓలు పని చేశారు. గతంలో ఓటు వేసిన గ్రాడ్యుయేట్లు సైతం కొత్తగా ఓటుహక్కు నమోదు చేసుకోవాల్సి ఉంది. పట్టభద్రుల ఓటు హక్కు నమోదుకు ఎలక్షన్ కమిషన్ 20 రోజులకుపైగా సమయం కల్పించినప్పటికీ ఇంత తక్కువ నమోదు కావడం గమనార్హం. అప్లికేషన్ల వెరిఫికేషన్‌కు సంబంధించి అర్హత ఓటర్లను గుర్తించడంలో ఆలస్యం అవుతోంది.

పన్నులు వందశాతం వసూలు చెల్లించాలి


- అదనపు కలెక్టర్ పర్మర్ పింకేశ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

జనగామ: పురపాలిక పరిధిలో ఇంటి, నల్లా పన్నులు వందశాతం వసూలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్మర్ పింకేష్‌కుమార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఇంటి, నల్లా, ఇతర పన్నులపై నిర్వహించిన సమీక్ష సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ఇప్పటి వరకు పన్నులు 32 శాతం మాత్రమే వసూలయ్యాయని, వసూళ్లలో వేగం పెంచాలని చెప్పారు. ట్రేడ్ లైసెన్స్‌పై ప్రతీ వ్యాపారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పి.జమున, మున్సిపల్ కమిషనర్ చంద్రమౌళి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు పి.లింగయ్య, పజ్జూరి గోపయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేడు టీఎస్‌డబ్ల్యూఆర్ సీఓఈ ప్రవేశపరీక్ష



సమావేశంలో పాల్గొన్న ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు

జనగామ రూరల్: టీఎస్‌డబ్ల్యూఆర్(సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) ఇంటర్మీడియట్‌లో 2024–25 విద్యాసంవత్సరం ప్రవేశానికి ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా సమన్వయ్య అధికారి అలగోని నర్సింహులు తెలిపారు. ఈ మేరకు శనివారం పరీక్ష సెంటర్ల కోఆర్డినేటర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్‌లో 257 మంది, జఫర్‌గఢ్‌లో 385, పాలకుర్తిలో 408, జనగామలో 214.. మొత్తం 1,264 మంది ఈ పరీక్షకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఆయా సెంటర్లలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఆలస్యంగా వచ్చిన వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని స్పష్టం చేశారు. హాల్‌టికెట్లను ఇంటర్‌నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, హాల్‌టికెట్, పరీక్ష ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో రావాలని సూచించారు.

ప్రాక్టికల్ పరీక్షలకు 107 మంది గైర్హాజరు

జనగామ రూరల్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు శనివారం 107 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల కన్వీనర్ భైరీ శ్రీనివాస్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 34 సెంటర్లలో పరీక్షలు జరుతున్నాయని పేర్కొన్నారు. ఆయన పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలను తనిఖీ చేశారు.

నిట్‌లో 'అగ్రీ హార్తి' వర్క్‌షాప్

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో శనివారం 'ఉన్నత్ భారత్ అభియాన్' ఆధ్వర్యంలో 'అగ్రీ హార్తి' అంశంపై ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ వేణువినోద్ ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక బృందాలు మహిళల మనోధైర్యాన్ని పెంపొందించడంలో ఉన్నత్ భారత్ అభియాన్ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు.

పల్లెల ప్రగతికి అధికారులు పాటుపడాలి



దేవరుప్పుల తహసీల్‌లో పాల్గొన్న అధికారులు

దేవరుప్పుల/బచ్చన్నపేట: ప్రత్యేక పాలనలో పల్లెల ప్రగతికి పారదర్శకంగా పాటుపడాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క సూచించారు. శనివారం జిల్లాలోని జీపీల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆమె ములుగు జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో చోటచేసుకున్న లోపాలను సవరించే క్రమంలో ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేదని, ఈ పరిస్థితుల్లో అధికారులపై అత్యంత నమ్మకంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పాలన తెచ్చిందని చెప్పారు. ప్రజాసంక్షేమానికి బాధ్యతాయుతంగా పాటుపడి పురోగతికి తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేకంగా పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్ల మరమ్మతులు వంటి అత్యవసర పనులపై దృష్టి సారించాలని తెలిపారు. చివరి రోజు ఊరూరా సమాజ రుగ్మతలపై మహిళా సంఘాల భాగస్వామ్యంతో చైతన్య సదస్సులు నిర్వహించాలని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ చట్టంపై జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ఓరియంటేషన్ సదస్సులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఆయా సమావేశాల్లో జిల్లా వ్యవసాయశాఖ అధికారి వినోద్‌కుమార్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకే..

- ఆరోపణలపై విచారణ చేపట్టాలి
- మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



నమస్కరిస్తున్న ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ: తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకే అసత్య ఆరోపణలు చేస్తున్నారు.. మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి వ్యవహారాన్ని చక్కదిద్దాలని మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి.. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కోరారు. వయసులో తనకంటే చిన్నవాడు.. అయినా సరే పార్టీ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రెండు చేతులెత్తి నమస్కరిస్తున్నాను అని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని స్వగృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రజాక్షేత్రానికి దూరంగా ఉన్నప్పటికీ తనపై కుట్రలు జరుగుతూనే ఉన్నాయన్నారు. దళితబంధు స్కీం అమలుకు సంబంధించి మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి వసూళ్లకు పాల్పడినట్లు 400 మంది దళితులు, ప్రజాప్రతినిధులు ఏకగ్రీవ తీర్మానం చేశారని పేర్కొన్న ఆయన.. తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేని కొందరు 'బద్దిపడగ'తో ఆరోపణలు చేయిస్తున్నారని చెప్పారు. ఎంపీ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో కేసీఆర్ వద్ద తనకు చెడ్డ పేరు తెచ్చేలా ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దళితబంధు విషయంలో ఎక్కడా అక్రమాలు జరగలేదని, పార్టీ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ విషయమై విచారణ చేయించాలని ముత్తిరెడ్డి.. పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కోరారు. కృష్ణారెడ్డి దళితుల వద్ద తీసుకున్న డబ్బులు వెంటనే తిరిగి ఇవ్వాలన్నారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, చేర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత



డీపీఓకు సమ్మెనోటీస్ అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

జనగామ రూరల్: దేశవ్యాప్తంగా ఈ నెల 16న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయడానికి గ్రామ పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో శనివానం డీపీఓ రంగాచారికి సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు, నాయకులు రామచంద్రం, వెంకట్‌రెడ్డి, లాజర్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగ్గురు కుమారులకు కౌన్సెలింగ్



తల్లిదండ్రులు, కుమారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్..

నెల్లికుదురు : మండలంలోని చిన్నముప్పారం గ్రామంలో తల్లిదండ్రులను పట్టించుకోని ముగ్గురు కుమారులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఇనుగుర్తి తహసీల్దార్ తోట సూర్యనారాయణ తెలిపారు. 'పాపం పండుటాకులు' అనే శీర్షికతో జనవరి 30వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆర్డీఓ.. వృద్ధ దంపతుల సమస్య పరిష్కరించాలని ఆదేశించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ మేరకు శనివారం బాధిత వృద్ధ దంపతులు గుండ వెంకన్న, సాలమ్మ దంపతుల కుమారులకు తహసీల్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తహసీల్దార్ తెలిపారు. తల్లిదండ్రులకు ఇల్లు నిర్మించి వారి రెండకరాల భూమిని వారి పేరుమీద పట్టా చేయాంచాలని ఆదేశించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

బాలిక మృతిని సుమోటోగా స్వీకరించిన కమిషన్

నెల్లికుదురు: మండలంలోని ఓ గ్రామంలో బాలుడు వేధించిన ఘటనలో బాలిక మృతి చెందింది. ఈ ఘటనను సుమోటోగా తీసుకున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు బృందాధర్ రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలుడు వేధించడంతో బాలిక మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ కేసు విచారణ సజావుగా సాగేలా రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ పర్యవేక్షిస్తుందన్నారు. కాగా, గత నెల 28న ఆత్మహత్యకు యత్నించిన బాలిక చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

దారి దోపిడీ ముఠా అరెస్టు

హసన్‌పర్తి : జాతీయ రహదారిపై దారి దోపిడీకీ పాల్పడుతున్న ఓ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం వంగపహాడ్ క్రాస్ వద్ద వాహనాల తనిఖీ సందర్భంగా ఓ ముఠా పోలీసులను చూసి పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. జాతీయ రహదారిపై పాదాచారులు, ప్రయాణికులను బెదిరించి దోపిడీకీ పాల్పడుతున్నట్లు ఆ ముఠా అంగీకరించారని సీఐ గోపి తెలిపారు. దారి దోపిడీకీ పాల్పడుతున్న వంగపహాడ్‌కు చెందిన ముస్కు కమల్, ఓదెల సురేష్, మహ్మద్ అబ్దుల్ ఘనీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ. 12 వేలు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.



మేడారంలో భక్తులకు బీఎస్ఎన్ఎల్ మెరుగైన సేవలు

గట్టమ్మ నుంచి గద్దెల వరకు 14 టవర్లు | 16 వైఫై హాట్ స్పాట్స్‌తో 1జీబీ డాటా ఉచితం

- ఒక టవర్ పరిధిలో 14 వేల మంది మాట్లాడుకునే అవకాశం
- రూ.249 రీచార్జ్‌తో ఉచితంగా సిమ్
- బీఎస్ఎన్ఎల్ జీఎం ఎం.చంద్రమౌళి




ఎం.చంద్రమౌళి, జీఎం, బీఎస్ఎన్ఎల్, వరంగల్

వరంగల్ : భక్తులకు శుభవార్త. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం సమ్మక్క –సారలమ్మ జాతరకు వస్తున్న భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్)వరంగల్ జనరల్ మేనేజర్ ఎం.చంద్రమౌళి తెలిపారు. ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మహాజాతరలో బీఎస్ఎన్ఎల్ నుంచి భక్తులకు కోసం ఏర్పాటు చేస్తున్న సేవలను ఆయన శనివారం 'సాక్షి'కి వివరించారు.

16 ప్రాంతాల్లో ఉచితంగా వైఫై..

మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఉచితంగా రోజుకు 1జీబీ డాటా అందించేందుకు 16 ప్రాంతాల్లో 16 హాట్ స్పాట్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గట్టమ్మ దేవాలయం, కొత్తూరు రోడ్, కొత్తూరు స్కూల్, ఊరట్టం ఎక్స్‌రోడ్, కాజ్‌వే, రెడ్డిగూడెం స్కూల్, హరిత హోటల్, ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఐటీడీఏ గెస్ట్‌హౌస్, బస్టాండ్, వాచ్‌టవర్, ఆసుపత్రుల వద్ద ఒక్కొక్కటి, నార్లాపూర్, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్, మేడారం అమ్మవారి గద్దెల ప్రాంతాల్లో హాట్ స్పాట్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ హాట్‌స్పాట్‌ల నుంచి 50 నుంచి 100 అడుగుల దూరంలో ఉన్న వారు (ఏ నెట్‌వర్క్ అయినా)వారి సెల్ నంబర్‌తో లాగిన్ అయితే ఉచితంగా 10–20 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 1జీబీ వరకు డాటా పొందొచ్చన్నారు. గత జాతరలో ప్రభుత్వం ఈహాట్‌స్పాట్స్‌కు నిధులు కేటాయించిందని, ఇప్పుడు ప్రతిపాదనలు పంపించామన్నారు.



అదనంగా 9 టవర్లు..

వరంగల్ నుంచి మేడారం వరకు ఉన్న రహదారిలో భక్తులకు ఎలాంటి నెట్‌వర్క్ కనెక్టివిటీలో అంతరాయం కలగకుండా తాత్కాలికంగా అదనంగా 9 టవర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ములుగు గట్టమ్మ నుంచి మేడారం వరకు ప్రధాన రహదారిలో పస్రా, ప్రాజెక్ట్ నగర్, వెంగళాపూర్, నార్లాపూర్, ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రాంతాల్లో 5 శాశ్వత టవర్లు ఉండగా జాతర సందర్భంగా భక్తులు అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించి సిగ్నల్స్‌కు అంతరాయం లేకుండా ఉండేందుకు గట్టమ్మ దేవాలయం, కొత్తూరు, ఊరట్టం ఎక్స్‌రోడ్, జంపన్నవాగు, కాజ్‌వే, మేడారం గద్దెలు, రెడ్డిగూడెం, ఆర్టీసీ బస్టాండ్, గెస్ట్‌హౌస్ వద్ద తాత్కాలికంగా 9 టవర్లను అదనంగా ఏర్పాటు చేశామన్నారు. ఈ టవర్లు 2జీ, 3జీ సేవలు అందిస్తాయన్నారు.

సిమ్‌లు ఫ్రీ..

రూ.249తో రీచార్జ్ చేసుకున్న వినియోగదారులకు ఉచితంగా సిమ్‌లను బీఎస్ఎన్ఎల్ ఫ్రాంచైజీలు అందజేస్తున్నాయన్నారు. సిమ్ తీసుకున్న వారు రోజూ 2 జీబీ డాటా, 100ఎస్ఎంఎస్‌లతో పాటు అన్‌లిమిటెడ్ ఔట్, ఇన్‌కమింగ్ కాల్స్ మాట్లాడుకొవచ్చని, 45 రోజుల పాటు చెల్లుబాటులో ఉంటుందన్నారు.

అన్ని శాఖలకు బీఎస్ఎన్ఎల్ సేవలే..

జాతర సందర్భంగా మేడారంలో సేవలు అందిస్తున్న ప్రైవేట్, ప్రభుత్వ, మీడియా సంస్థలన్నింటికీ బీఎస్ఎస్ఎన్ లీజ్డ్ లైన్లు, డాటా సౌకర్యం అందిస్తుందన్నా. నిరంతరంగా సేవలు అందించేందుకు 20 మంది అధికారులు, సిబ్బందితో 3 మెయింటనెన్స్, ట్రాన్స్‌మిషన్, ఇతర బృందాలు ఏర్పాటు చేశామన్నారు.

ఒకేసారి 14వేల మంది మాట్లాడుకోవచ్చు..

బీఎస్ఎన్ఎల్ ఏర్పాటు చేస్తున్న ఒక టవర్ పరిధిలో వేయి మంది ఒకేసారి ఔట్ గోయింగ్, ఇన్‌కమింగ్ కాల్స్ మాట్లాడుకునే సౌకర్యం ఉంటుందన్నారు. మేడారం జాతర సందర్భంగా అదనంగా ఏర్పాటు చేస్తున్న 9, 5 శాశ్వత టవర్లతో మొత్తం 14 టవర్ల నుంచి 14వేల మంది ఒకేసారి ఇన్‌కమింగ్, ఔట్ గోయింగ్ కాల్స్ మాట్లాడుకోవచ్చన్నారు.

జాతరను కనుల పండువగా నిర్వహించాలి

- మల్టీజోన్ ఐజీ తరుణ్‌జోషి



సమీక్షలో మాట్లాడుతున్న ఐజీ తరుణ్‌జోషి

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ జాతరను కనుల పండుగా నిర్వహించాలని మల్టీజోన్ ఐజీ తరుణ్‌జోషి అన్నారు. శనివారం మేడారంలోని నూతన పోలీస్‌స్టేషన్ భవనంలో ఎస్పీ శబరీశ్ ఆధ్వర్యంలో నోడల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ మేడారం జాతరకు కోటి మందికిపై భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గత జాతరలో తనకు ట్రాఫిక్ విభాగానికి ఇన్‌చార్జ్‌గా పనిచేసిన అనుభవం ఉందని, జాతరలో ముఖ్యమైన విభాగం ట్రాఫిక్ నిర్వహణ మాత్రమేనని అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. పస్రా నుంచి మేడారం వరకు ఎక్కడా వాహనాల రద్దీ ఏర్పడొద్దని తెలిపారు. అనంతరం ఎస్పీ శబరీశ్ ఉన్నతాధికారులు, అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జాతర పనులపై వివరణ అందించారు. ఇందులో భాగంగా రిసెప్షన్ డ్యూటీస్, ట్రాఫిక్ నిర్వహణలో భాగంగా రూట్ మొబైల్ పార్టీస్, ప్రతి 4 కిలోమీటర్లకు పోలీస్ ఔట్‌పోస్ట్, సైన్ బోర్డ్స్, రద్దీ నిర్వహణ, వీఐపీ, వీవీఐపీ భద్రత, సీసీటీవీ పర్యవేక్షణ, మీడియా, వీఐపీ పాసులు వంటి అంశాలపై సిబ్బందికి మార్గదర్శకాలు వివరించారు. అనంతరం ఐజీ తరుణ్‌జోషి.. నోడల్ అధికారులతో కలిసి వివిధ పార్కింగ్ ప్రదేశాలను సందర్శించి సలహాలు, సూచనలు అందించారు. అంతకు ముందు ఐజీ తరుణ్‌జోషి వనదేవతలు సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్నారు. సమావేశంలో ఆదిలాబాద్ ఎస్పీ గాష్ ఆలం, భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖారే, సిరిసిల్ల ఎస్పీ అఖిల్‌మహాజన్, మంచిర్యాల డీసీపీ సుధీర్‌కేకన్, ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏటూరు నాగారం ఏఎస్పీ సంకీర్త్ పాల్గొన్నారు.

భక్తులు ఇబ్బందులు పడొద్దు

ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలి

- సౌకర్యాల కల్పనలో విఫలమైతే చర్యలు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ జాతరలో భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం మేడారంలోని హరిత హోటల్‌లో పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టర్ హన్మంతావు, కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి జాతర పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతర పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండడమే కాకుండా మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పనులు సవ్యంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక అధికారులకు తోడుగా జీహెచ్ఎంసీ, జీడబ్ల్యూఎంసీ, ఇతర మున్సిపల్ కార్పొరేషన్‌ల నుంచి అనుభవజ్ఞులైన అధికారులు, నైపుణ్యం కలిగిన సిబ్బంది సేవలను జాతరకు తీసుకోవాలన్నారు. జాతర ప్రాంతాన్ని సెక్టార్లుగా విభజించి విధులకు అధికారులు, సిబ్బందిని బాధ్యులను చేయాలన్నారు. ముఖ్యంగా శానిటేషన్, మరుగుదొడ్లు, మంచినీటి ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. షాపులకు డస్ట్ బిన్‌లు వినియోగించేలా ఆదేశాలిచ్చి, పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. పాటించని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. జాతర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.75 కోట్లు కేటాయించడమే కాకుండా మరో రూ. 30 కోట్లు అధికంగా కేటాయించేలా చూస్తామన్నారు. మేడారం జాతరకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు వచ్చేలా ఆహ్వాన పత్రాలు అందజేస్తామని, ముఖ్యమంత్రి కూడా జాతరకు వచ్చేలా చూస్తామన్నారు. సౌకర్యాల కల్పనలో అధికారులు విఫలమైతే కఠిన చర్యలు తప్పవన్నారు. జాతర పరిసర ప్రాంతాల్లో చుట్టూ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని, మిగతా పనులను మూడు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. భక్తులు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయంగా క్లాత్, జూట్, పేపర్ సంచులు తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ అంకిత్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ పాల్గొన్నారు.

ప్రజాధనం లూటీ చేసింది కేసీఆర్ కుటుంబం

ప్రజా ధనాన్ని లూటీ చేసింది కేసీఆర్ కుటుంబమేనని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాఅభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. ఇంద్రవెల్లిలో జరిగిన పార్టీ సభను చూసి తట్టుకోలేక ఎమ్మెల్సీ కవిత నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శనివారం మేడారంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు సౌకర్యాన్ని ఓర్వలేకపోతున్నారన్నారు. ప్రియాకం గాంధీని అడ్డుకుంటామని కవిత మాట్లాడుతుందని, ఆమె కాలిగోటికి సరిపోదన్నారు. అమరుల త్యాగాలతో ఏర్పడిన రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం రాజాభోగాలను అనుభవించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తే ప్రజలు క్షమించారన్నారు.

మేడారంలో సకల సౌకర్యాలు

- రాష్ట్ర మంత్రి సీతక్క



కొండాయిలోని గోవిందరాజులు గద్దెను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం: భక్తుల సౌకర్యార్థం మేడారం జాతర అభివృద్ధికి ప్రభుత్వం రూ. 75 కోట్లు కేటాయించిందని, ఇంకా రూ. 30 కోట్లు కేటాయించడానికి ప్రతిపాదనలు పంపుతామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఏటూరు నాగారం మండలం మల్యాల గ్రామంలోని సమ్మక్క గుడి, కొండాయి గ్రామంలోని గోవిందరాజులు, నాగులమ్మ దేవాలయాలను దర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కోటి మందికి పైగా భక్తులు వచ్చే జనజాతరకు ప్రభుత్వం భారీ ఎత్తున కేటాయించి సకల సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. మేడారం వచ్చే రహదారుల పనులు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. కొండాయి నుంచి ఊరట్టం వచ్చే రహదారి విషయంపై అటవీ అధికారుల అనుమతి కోసం మంత్రి కొండా సురేఖతో చర్చించి త్వరలోనే రహదారి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. జాతర పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వరదల సమయంలో కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాలు ముంపునకు గురయ్యాయని, ఇక్కడి గ్రామాలను జాతర అనంతరం వేరే ప్రాంతాలకు తరలించడామా, లేదా గ్రామ చుట్టు వరద రాకుండా కరకట్ట నిర్మించాలా అనే విషయంపై అధికారులతో నివేదిక తెప్పించుకుని ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. అంతకుముందు దొడ్ల బ్రిడ్జిని సందర్శించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీఓ అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఏఎస్పీ సంకీర్త్, తదితరులు పాల్గొన్నారు.

బాలుడి ఆచూకీ ఎక్కడ?



కుమారుడితో తస్లీమ్(ఫైల్)

పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో యాకుబ్‌బాబా దర్గా చెరువులో గుర్తు తెలియని మృతదేహం శుక్రవారం లభించగా స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా, మృతురాలు శంభునిపేటకు చెందిన తస్లీమ్‌గా గుర్తించారు. కొద్ది రోజుల క్రితం వరంగల్‌లోని మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో తస్లీమ్, ఆమె కుమారుడు కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కాగా, మహిళ మృతదేహాన్ని శనివారం పోస్టుమార్టం నిమిత్తం ఎస్సై వీరభద్రరావు ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఇదిలాఉండగా.. ఆమె ఆరు సంవత్సరాల కుమారుడు దర్గా చెరువులో పడి ఉండొచ్చని పోలీసులు బోటు సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం లభించలేదు. ఈక్రమంలో బాలుడిని ఎవరికైనా అప్పగించి ఉంటుందా.. లేదా ఆమెతోపాటు చెరువులో వేసి ఉంటుందా అనే విషయంపై స్పష్టతలేకుండా పోయింది. అయితే తస్లీమా మృతదేహం వద్దకు ఆమె బంధువులు తప్ప ఆమె భర్త, బంధువుల ఎవరూ రాకపోవడంతో భర్తపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.



భాస్కర్ (ఫైల్)

చిల్పూరు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం మండలంలోని వెంకటాద్రిపేట సమీపంలో జరిగింది. ఎస్సై వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని తీగలతండా పంచాయతీ పరిధిలోని వాచ్యతండాకు చెందిన బానోత్ భాస్కర్(25), స్వరూప అక్కాతమ్ముళ్లు. స్వరూప కూతురు తరిగొప్పుల మండల కేంద్రంలో ఓ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. ఆమెను తండాకు తీసుకువచ్చేందుకు స్వరూప, భాస్కర్ ద్విచక్రవాహనం వెళ్తున్నారు. ఈ క్రమంలో వెంకటాద్రిపేట సమీపంలో కొమ్ముగుట్ట నుంచి చిన్నపెండ్యాలకు వస్తున్న కారు.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందగా స్వరూప తీవ్రంగా గాయపడింది. దీంతో స్వరూపను కానిస్టేబుల్ వీరన్న 108లో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అనంతరం కారు డ్రైవర్ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతుడి కుటుంబీకులను ఎంపీటీసీ మారేపల్లిలలితాశ్యాంకుమార్‌రెడ్డి పరామర్శించారు.

తాడిచర్లలో మరో యువకుడు..

మల్హర్: వాటర్ ట్యాంకర్ లారీ, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలో తాడిచర్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని పెద్దతూండ్ల గ్రామానికి చెందిన సాయివినయ్, మధుకర్.. పని నిమిత్తం తాడిచర్ల గ్రామానికి వెళ్లారు. పని ముగిసిన అనంతరం బైక్‌పై మల్లారం వైపునకు వస్తున్నారు. ఈ క్రమంలో తాడిచర్ల–మల్లారం రహదారి మలుపు సమీపంలో రోడ్డుపై నీళ్లు చల్లుతున్న ఏఎమ్మార్ కంపెనీకి చెందిన వాటర్ ట్యాంకర్, బైక్ ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న సాయివినయ్(20) అక్కడికక్కడే మృతి చెందగా, మధుకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మధుకర్ పరిస్థితి విషమంగా ఉండడంతో 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.



సాయివినయ్(ఫైల్)

మృతదేహంతో ఆందోళన

వాటర్ ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే సాయివినయ్ మృతిచెందాడని తాడిచర్ల ఏఎమ్మార్ క్యాంపు ఆవరణలో కుటుంబీకులు మృతదేహంతో బైఠాయించి ఆందోళన చేశారు. న్యాయం జరిగే వరకూ కదిలేది లేదని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, కాటారం సీఐ రంజిత్‌రావు, కొయ్యూరు ఎస్సై నరేష్.. ఘటనా స్థలికి చేరుకోని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, లక్ష్మీనారాయణ, అరుణ దంపతుల కుమారుడు సాయివినయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పెద్దతూండ్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆటో బోల్తా పడి డ్రైవర్..



లక్ష్మణ్ (ఫైల్)

చెన్నారావుపేట : ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన చెన్నారావుపేట మండలం సూర్యాపేట తండా సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ ప్రకారం.. ఇదే తండాకు చెందిన ధారావత్ లక్ష్మణ్(40) ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కిరాయికి వెళ్లి శనివారం తెల్లవారుజామున తండాకు వెళ్తున్న క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

అనారోగ్య సమస్యలతో పెట్రోల్ మెన్ ఆత్మహత్య



పాండు (ఫైల్)

కాశిబుగ్గ /కేసముద్రం: అనారోగ్య సమస్యలతో రైలు కింద పడి పెట్రోల్ మెన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శని వారం తెల్లవారుజామున కేసముద్రం, తాళ్లపూసలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం జమలాపురం గ్రామానికి చెందిన బరిగేల పాండు(42) కేసముద్రం రైల్వే క్వార్టర్స్‌లో నివాసముంటూ రైల్వే పెట్రోల్ మెన్‌గా పనిచేస్తున్నాడు. అనారోగ్య సమస్యలు, వ్యక్తిగత కారణాలతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ పి రాజు కేసు నమోదు చేసి మృతదేహనికి మహబూబాబాద్ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి మృతుడి భార్య సౌజన్యకు అప్పగించామని సీఐ తెలిపారు.

రైలునుంచి జారిపడి వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

డోర్నకల్ : రైలునుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున మహబూబాబాద్–గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. డోర్నకల్ జీఆర్పీ ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం ఆయా రైల్వే స్టేషన్ల మధ్యలోని కిలోమీటర్ నంబర్ 443/11 సమీపంలో సుమారు 40 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడు బ్లూ కలర్ షర్ట్, సిమెంట్ కలర్ ప్యాంట్ ధరించాడని తెలిపారు. మహబూబాబాద్ డిప్యూటీ స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

6న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

హన్మకొండ కల్చరల్: విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 6న సద్గురు త్యాగరాజస్వామి 177వ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం పోతనవిజ్ఞాన పీఠం ఆడిటోరియంలో త్యాగరాజస్వామి పూజా కార్యక్రమం, మధ్యాహ్నం పండిత్ శ్రీవిష్ణు నారాయణ్ భాత్ఖండే, పండిత్ శ్రీవిష్ణు దిగంబర్ పలుస్కర్ జయంతి ఉత్సవం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

'మహాలక్ష్మి'తో ఎన్నో ప్రయోజనాలు

రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

- స్లీపర్ ఏసీ బస్సులు ప్రారంభం
- కారుణ్య నియామకాల ఉత్తర్వుల అందజేత



ఏసీ స్లీపర్ కోచ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని, కేఆర్ నాగరాజు

హన్మకొండ: ఆర్టీసీ బస్సులు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్నాయని, మహాలక్ష్మి పథకంతో అనేక ప్రయోజనాలున్నాయని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నాలుగు ఏసీ స్లీపర్ కోచ్ బస్సులను ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజుతో కలిసి ప్రారంభించారు. అనంతరం కారుణ్య నియామకాలకు సంబంధించి అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధాన నగరాల్లో ఉచిత వైద్య సేవలు అందుతున్న అక్కడికి వెళ్లేందుకు రవాణా ఖర్చులు లేక ఇప్పటి వరకు పేదింటి మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రేవంత్‌రెడ్డి సర్కార్ మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించిందన్నారు. దీంతో మహిళలు హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలకు వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారంటే ఇంతకంటే సంతృప్తి ప్రభుత్వానికి ఏముంటుందన్నారు. ఆర్టీసీ ఆర్ఎం శ్రీలత మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుంచి వరంగల్ రీజియన్‌లో 1.20 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని వివరించారు. రాష్ట్రంలో మొదటిసారి వరంగల్ రీజియన్‌లోనే కారుణ్య నియామకాలు చేపట్టామన్నారు. కారుణ్య నియామకాల కింద 49 మంది, అనారోగ్యాల కారణంగా రిటైర్మెంట్ తీసుకున్న ఉద్యోగి కుటుంబాలకు చెందిన 22 మందిని కండక్టర్లుగా నియమించినట్లు వివరించారు. కార్యక్రమంలో వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్త, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంలు కేశరాజు భానుకిరణ్, మాధవరావు, డిపో మేనేజర్లు వంగల మోహన్ రావు, బి.ధరంసింగ్, తదితరులు పాల్గొన్నారు.